క్లుప్తంగా

'బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం'


జగదీష్ యాదవ్

లంగర్‌హౌస్: బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ ఆరెళ్ల జగదీష్‌యాదవ్ అన్నారు. గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్‌గా లంగర్‌హౌస్‌కు చెందిన ఆరెళ్ల జగదీష్ యాదవ్‌ను దేవాదాయ శాఖ నియమించింది. ఈ సందర్భంగా జగదీష్‌యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణలో తొలి బోనం సమర్పించి బోనాల ఉత్సవాలు ప్రారంభించేది గోల్కొండ జగదాంబిక ఆలయం నుంచే అన్నారు. ఈనెల 22వ తేదీ లంగర్‌హౌస్ నుంచి ప్రారంభమయ్యే బోనాల ఉత్సవాల్లో భక్తులు, సందర్శకులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా గతంలో పెద్దల అనుభవాలను, సలహాలను కూడా తెలుసుకుంటూ మరింత ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. నగరంలోని పలు ప్రముఖ ఆలయాలతో పాటు, విజయవాడకు అమ్మవారికి సమర్పించే సాంప్రదాయ పద్ధతులను అందరి సహకారాలతో వైభవంగా నిర్వహిస్తామన్నారు.

కష్టపడితే బంగారు భవిష్యత్తు


షాన్వాజ్ ఖాన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: కష్టపడి క్రమశిక్షణతో పని చేసే వారు తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోగల్గుతారని ప్రముఖ వస్త్ర వ్యాపారి ఎస్ఎం ట్రెండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ షాన్వాజ్ ఖాన్ అన్నారు. ఆదివారం గోల్కొండలోని బంజారు దర్వాజ వద్ద ఎందరో యువకులకు ఉపాధి కల్పించిన సందర్భంగా షాన్వాజ్ ఖాన్‌ను పలువురు మజ్లిస్ నాయకులు, ఎస్ఎం ట్రెండ్స్ సిబ్బంది సన్మానించారు.

పేదలకు చేయూతనివ్వాలి



చార్మినార్: సమాజంలోని పేదలకు చేయూతను అందజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని నార్‌నూల్ అగర్వాల్ సమితి హైదరాబాద్, సికింద్రాబాద్ అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. సమితి ఆధ్వర్యంలో ఆదివారం నయాపూల్‌లోని ప్రభుత్వ ఆధునిక ప్రసూతి ఆస్పత్రి వద్ద రోగులు, వారి సహాయకులకు ఉచితంగా ఆహార పదార్థాలు, తాగునీటి బాటిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు తమ సహాయ సహకారాలు అందజేయడంలో స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వంతో కలిసి ముందుకు రావాలన్నారు. పేదలకు తమ సేవలను అందజేయడానికి కృషి చేయాలన్నారు. విశాల్ బన్సల్, అనూప్ అగర్వాల్ పాల్గొన్నారు.

ఏసియన్ ట్రాక్ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌కు ఆశీర్వాద్ సక్సేనా



చార్మినార్: ఈనెల 14 నుంచి 19 వరకు మలేషియాలో జరిగే ఏసియన్ ట్రాక్ సైక్లింగ్ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో భారత దేశం తరఫున పాల్గొనేందుకు పాతబస్తీ శాలిబండకు చెందిన ఆశీర్వాద్ సక్సేనా ఎంపికైనట్లు తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.దత్తాత్రేయ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి అంతర్జాతీయ సైక్లిస్ట్‌గా ఇప్పటికే పలు పోటీల్లో పాల్గొన్న ఆశీర్వాద్ సక్సేనా పలు అవార్డులు అందుకున్నారన్నారు. శాలిబండ సైక్లింగ్ క్లబ్ సభ్యుడైన సక్సేనా న్యూఢిల్లీలోని సాయి అకాడమిలో వీఎస్ సింగ్ వద్ద శిక్షణ పొందుతున్నాడన్నారు.

అన్నదానం

గోల్కొండ: పేదలకు రోజుకు కనీసం ఒక పూట కడుపు నిండా అన్నం అందించాలనే ధ్యేయంతోనే 475 రోజులుగా అన్నదానం నిర్వహిస్తున్నామని ప్రముఖ సంఘసేవకుడు, గోల్కొండ ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్ అన్నారు. ఆదివారం రాత్రి ఆయన పలు ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద రోగుల సహాయకులకు భోజన ప్యాకెట్లు అందజేశారు.

గంజాయి విక్రేత అరెస్ట్

దబీర్‌పురా: పాతబస్తీ సాలార్‌జంగ్ మ్యూజియం రోడ్డులోని ఆటో స్టాండ్ వద్ద సయ్యద్ సిరాద్(62) అనే ఓ వృద్ధుడు ఆదివారం అక్రమంగా గంజాయి విక్రయిస్తు పట్టుబడ్డాడు. మీర్‌చౌక్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన సయ్యద్ సిరాజ్ గుట్టుచప్పుడు కాకుండా తన బ్యాగులో గంజాయి పొట్లాలను తీసుకొచ్చి విక్రయిస్తుండగా స్థానికంగా ఆటో స్టాండ్‌లో ఉండే ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకుడు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని మీర్‌చౌక్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 200 గ్రాముల గంజాయి కలిగిన 12 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు మీర్‌చౌక్ పోలీసులు తెలిపారు.

సందడే.. సందడి

- పాఠశాల సెలవులు పూర్తికావడంతో పెరిగిన సందర్శకుల రద్దీ
- కళకళలాడిన పాతబస్తీ పర్యాటక ప్రాంతాలు
- వ్యాపారులకు పెరిగిన గిరాకీ.. వాహనదారులకు తప్పని ట్రాఫిక్ తిప్పలు


చార్మినార్ రోడ్డులో సందర్శకుల సందడి

చార్మినార్: ఈ వారంతో పాఠశాల విద్యార్థులకు సెలవులు పూర్తికావడంతో తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తున్నారు. దీంతో ప్రపంచ పర్యాటక ప్రాంతమైన పాతబస్తీలో వీకెండ్‌లో వీరితో పాటు పర్యాటకుల రద్దీ పెరిగింది. మండే ఎండలను సైతం లెక్కచేయని పర్యాటకులు పాతబస్తీలోని చార్మినార్, మక్కా మసీదులతో పాటు సాలార్‌జంగ్ మ్యూజియం, హెచ్ఈహెచ్ నిజాం మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్ మ్యూజియాలను సందర్శించడానికి ఎక్కువగా ఆసక్తి చూపించారు. ఓ వైపు ఎండలు మండిపోతున్నా.. సందర్శకుల రద్దీ ఎక్కువగానే ఉంది. ఆదివారం సందర్శకుల సంఖ్య మరీ రెట్టింపు కావడంతో పాతనగరంలోని పర్యాటక ప్రాంతాల వద్ద స్థానిక వ్యాపారులకు గిరాకీ సైతం పెరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యాటక ప్రాంతాలన్నీ సందర్శకులతో కళకళలాడాయి. చార్మినార్ కట్టడం వద్ద రోజంతా పర్యాటకుల సందడి కనిపించింది. పర్యాటకుల సంఖ్య పెరగడంతో వాహనదారులకు ట్రాఫిక్ తిప్పలు తప్ప లేదు. గుల్జార్‌హౌజ్ నుంచి మదీనా సర్కిల్ వరకు పర్యాటకులు వెళ్లడానికి కాలి నడకకు కూడా కష్టమైంది.

తెలంగాణ ఉద్యమకారులకు సన్మానం


ఉద్యమకారులను సన్మానిస్తున్న టూరిజం మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, జీవన్‌సింగ్

జియాగూడ: తెలంగాణ ఉద్యమ సమయంలో పోరాటం చేసిన బీఆర్ఎస్ నాయకులను సన్మానించడం హర్షణీయమని తెలంగాణ టూరిజం మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఠాకూర్ జీవన్‌సింగ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కావూరి వెంకటేష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జియాగూడ భారత అభ్యుదయ ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం, ఉద్యమ నాయకులకు సన్మాన కార్యక్రమం, గ్రేటర్ నాయకుడు యాద శ్రీనివాస్‌గుప్తా, డివిజన్ అధ్యక్షుడు బి.నరహరిచారి, ప్రధాన కార్యదర్శి సి.బాబు ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అంతకు ముందు దుర్గానగర్ చౌరస్తాలో ఉప్పల శ్రీనివాస్ గుప్తా బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఉద్యమ నాయకుడు రంగ పరందాములు, రాష్ట్ర నాయకుడు కొమ్ముల నరేందర్, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు నర్మద, యూత్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, మాజీ అధ్యక్షుడు జడల మోహన్ తదితరులను శాలువా కప్పి మెమోంటో అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఇన్‌చార్జ్ ఠాకూర్ జీవన్ సింగ్ మాట్లాడుతూ.. ఉద్యమకారులను పార్టీ తప్పకుండా గుర్తించి సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. పార్టీ ఎంతో పటిష్టతతో పనిచేస్తుందని, పార్టీలో ఉంటూ వ్యతిరేకంగా మాట్లాడేవారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దిలీప్‌కుమార్, సంగీత, అరుణ, అనిత, శాంత, దేవేందర్‌సాగర్, శంకర్‌సింగ్, పాలెం వెంకటేష్, కె.నర్సింగ్‌రావు, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లింగాయత్‌లకు రూ.లక్ష ఆర్థిక సాయం పథకాన్ని వర్తింప చేయాలి


శ్రీనివాస్‌గౌడ్‌కు విన్నవిస్తున్న ఈశ్వరప్ప తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులవృత్తులకు అందజేస్తున్న రూ.లక్ష ఆర్థిక సాయాన్ని లింగాయత్‌లకు కూడా వర్తింపజేయాలని తెలంగాణ రాష్ట్ర వీరశైవ లింగాయత్ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.ఈశ్వరప్ప రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వరప్ప మాట్లాడుతూ.. వీరశైవ లింగాయత్‌లలో దాదాపు 90 శాతం మంది సామాజిక, ఆర్థిక ఉద్యోగ రంగాల్లో వెనుకబడే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు, దళితబంధు పథకాలకు లేని నియమ నిబంధనలు బీసీ కులవృత్తులకు ఎందుకు అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ బలిజ సంఘం కేంద్రకమిటీ సభ్యులు డాక్టర్ కె.శివప్ప, గౌరవ అధ్యక్షుడు పటోళ్ల సంఘమేశ్వర్, ప్రధాన కార్యదర్శి శక్తి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల జాతరకు ఆలయం ముస్తాబు



ముస్తాబవుతున్న అమ్మవారి ఆలయం, ప్రాంగణం

గోల్కొండ: చారిత్రక బోనాల జాతరకు జగదాంబిక మహంకాళి ఆలయం ముస్తాబవుతుంది. ఆలయ పరిసరాలతో పాటు ఆలయ ప్రాంగణాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దేందుకు దేవాదాయశాఖ అధికారులు ముమ్మరంగా పనులు నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో దేవతావిగ్రహాల చిత్రాలు ఆలయ గోడలపై చేయి తిరిగిన కళాకారులతో పెయింటింగ్ చేయిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరాజు అన్నారు. దేవతల పెయింటింగ్‌ను అద్భుతంగా వేయగల చిత్రకారులను నియమించి ఆలయ గోడలు, ఆలయ ప్రాంగణంలో దేవతల బొమ్మలు అత్యంత ఆకర్షణీయమైన ముగ్గులు వేస్తున్నామన్నారు. ఈనెల 22న ఈ బోనాలను వైభవంగా ప్రారంభించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ ఏర్పాట్లలో అమ్మవార్ల భక్తులతో పాటు అమ్మవారి వృత్తిపని సంఘం వారి సేవలు, సలహాలను కూడా పాటిస్తున్నామని ఆయన అన్నారు. మహిళా భక్తుల కోసం ప్రత్యేకంగా పూజలు చేసుకోవడానికి ప్రాంగణంలోని అధిక భాగాన్ని కేటాయిస్తున్నారు. వృద్ధ మహిళా భక్తుల కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించి వారికి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణలో మొట్టమొదటిగా ప్రారంభమయ్యే ఈ బోనాల ఉత్సవాలను తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంది.

లోధ్ కులస్తులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం


సమావేశంలో నందకిశోర్ వ్యాస్ బిలాల్, మహేష్ సింగ్‌లోధ్ తదితరులు

అబిడ్స్: లోధ్ కులస్తులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉండి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. ధూల్‌పేట్‌లోని లోధ్ కులస్తుల సంఘానికి నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మహేష్ సింగ్‌లోధ్‌తో పాటు పలువురు నాయకులను నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోధ్ కులస్తుల దీర్ఘకాలిక సమస్యలను మంత్రి తలసాని సహకారంతో మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. లోధ్‌ల కోసం తాను అండగా ఉండి వారు విద్య, వికాసంతో పాటు అన్నిరంగాల్లో రాణించే విధంగా కృషి చేస్తామని నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌సింగ్ లోధ్, శంకర్‌సింగ్ జమేదార్, గోపాల్‌సింగ్, బల్‌దేవ్ సింగ్, ధినేష్ సింగ్, తుల్జారామ్ సింగ్, నర్సింహా, అర్జున్, సుభాష్, శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజేమార్కెట్ చౌరస్తాలో అగ్నిప్రమాదం

గన్‌ఫౌండ్రీ: ఎంజేమార్కెట్ చౌరస్తా సమీపంలోని అమర్ టెంట్‌హౌస్ గోడౌన్‌లో బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు, బేగంబజార్ పోలీసుల వివరాల ప్రకారం.. సాయంత్రం వేళ గోడౌన్‌లో మంటలు వ్యాప్తి చెందడంతో స్థానికులు సమాచారం అందించినట్లు తెలిపారు. ఆదివారం గోడౌన్ మూసి ఉండడంతో గోడౌన్ షట్టర్ తాళాలు పగలుగొట్టి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. కానీ మంటలు అదుపులోకి రాకపోవడంతో తక్షణమే గౌలిగూడ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. ఈ ప్రమాదంలో పెళ్లి డెకరేషన్‌కు సంబంధించిన సామాన్లు, కొన్ని టెంట్ల క్లాత్ సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు పోలీసులు భావిస్తున్నారు.

బీసీ బడ్జెట్ నిధులను విడుదల చేయాలి



చార్మినార్: బీసీ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు బీసీ బడ్జెట్ నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్ కోరారు. ఈ మేరకు మంత్రి హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి బీసీ సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. బీసీ బడ్జెట్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు.

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు

సుల్తాన్‌బజార్: కోఠి ఉమెన్స్ కళాశాలలో జరిగిన గ్రూప్-1 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. గ్రూప్-1 పరీక్ష రాసే మొత్తం అభ్యర్థులు 1000 మంది ఉండగా అందులో 456 మంది హాజరయ్యారు. మిగతా 552 మంది గైర్హాజరయ్యారు. ముగ్గురు అభ్యర్థులు పరీక్షకు సమయానికి రాకపోవడంతో ఉమెన్స్ కళాశాల ఇన్విజిలేటర్స్ ముగ్గురిని పరీక్ష రాయడానికి అనుమతించలేదు. దీంతో వారు నిరాశగా వెనుదిరిగారు. అందులో సంస్థాన్ నారాయణపూర్ నల్గొండ జిల్లాకు చెందిన స్వాతి అనే అభ్యర్థిని ఆలస్యంగా రావడంతో కళాశాల సిబ్బంది పరీక్షకు అనుమతించకపోవడంతో ఆమె ఎంతో ప్రాధేయపడినా లోపలికి అనుమతించలేదు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



సాక్షి, సిటీబ్యూరో: బుద్ధసింగ్ బైటక్ పంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఠాకూర్ ప్రేమ్‌సింగ్, నాయకులు సంజయ్ సింగ్, సతీష్ సంగ్, జస్వీర్ సింగ్ తదితరులు ఉన్నారు.

ములుగు జడ్పీ చైర్మన్ మృతి పద్మశాలీలకు తీరని లోటు

గోల్కొండ: ములుగు జడ్పీ చైర్మన్ జగదీశ్ అకాల మరణంతో పద్మశాలీలు ఒక పోరాట సోదరుడిని కోల్పోయారని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కుసుమ జగదీశ్ మృతిపట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో దివంగత కుసుమ జగదీశ్ కనబర్చిన పోరాట పటిమ ఎందరో యువకులకు అప్పట్లో ఆదర్శంగా నిలిచిందన్నారు.

గోషామహల్‌లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తాం


ఇస్మాయిల్ అన్సారీని సన్మానిస్తున్న నందకిషోర్ వ్యాస్, చిత్రంలో గడ్డం శ్రీనివాస్ యాదవ్

నాంపల్లి: రాబోయే ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ గోషామహల్ నియోజకవర్గం ఇన్‌చార్జి నందకిషోర్ వ్యాస్ బిలాల్ అన్నారు. బీఆర్ఎస్ మైనార్టీ విభాగం గోషామహల్ నియోజకవర్గం చైర్మన్‌గా మహ్మద్ ఇస్మాయిల్ అన్సారీ అలియాస్ ఉర్దూ అన్సారీ నియమితులైన సందర్భంగా శనివారం రాత్రి నాంపల్లిలోని భాగ్యనగర్ కాలనీలో అభినందన సత్కార సభను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి నందకిషోర్ వ్యాస్ బిలాల్ హాజరై ప్రసంగించారు. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం ప్రగతిపథంలో పయనిస్తోందన్నారు. మహ్మద్ ఇస్మాయిల్ అన్సారీ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 70 వేల మైనార్టీ ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. ప్రతి డివిజన్‌లో మైనార్టీ సదస్సును ఏర్పాటు చేసి నంద కిషోర్ వ్యాస్ బిలాల్‌ను గెలిపించుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పక్షాన మహ్మద్ ఇస్మాయిల్ అన్సారీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు గడ్డం శ్రీనివాస్ యాదవ్, ధన్‌రాజు, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


గాయకుడు సంజయ్‌ని సత్కరిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

అబిడ్స్: కళాకారుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్కొన్నారు. అన్ని రంగాల్లో రాణిస్తున్న కళాకారులకు ప్రభుత్వం అండగా ఉందన్నారు. గోషామహల్ హిందీనగర్‌కు చెందిన గాయకులు సంజయ్‌ను బీఆర్ఎస్ గోషామహల్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్‌తో కలిసి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఘనంగా సత్కరించారు. ఇటీవల గాయకుడు సంజయ్ పలు విభాగాల్లో రాణించడం ఎంతో అభినందనీయమన్నారు. కళాకారులకు తనవంతు సహకారం కూడా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్‌తో పాటు శంకర్‌లాల్ సందీప్, జగపతి సాయి, శివరామ్, పప్పు మాత్రే ధన్‌రాజ్, జైశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోతరాజుల ఆభరణాలు, దుస్తులకు పూజలు


పోతరాజుల ఆభరణాలు, దుస్తులకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గోల్కొండ: పోతరాజుల వృత్తి వంశపారంపర్యంగా కొనసాగిస్తున్నామని పోతరాజు తల్వార్ శివ అన్నారు. ఆదివారం గోల్కొండ రిసాలబజార్‌లోని శివాలయ ప్రాంగణంలో పోతరాజుల ఆభరణాలు, దుస్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం అమ్మవార్లపై ఉన్న భక్తి, పోతరాజు వృత్తిపై మమకారంతోనే తాము ఈ వృత్తిలో కొనసాగుతున్నామన్నారు. చాలీచాలని ఆదాయంతోనే జీవితం సాగిస్తున్నామని ఆయన అన్నారు. శ్రీ గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆలయ వృత్తిపని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబా చారి మాట్లాడుతూ.. పోతరాజులకు ప్రభుత్వం ప్రతినెలా గౌరవ వేతనం ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. ఈనెల 22న ఈసారి రిసాల బజార్ నుంచి మహంకాళి అమ్మవారి జులూస్ ప్రాంభమవుతుందని, శ్రీకాంత్ చారి ఆధ్వర్యంలో జరిగే ఈ భారీ ఊరేగింపులో 57 మంది పోతరాజుల విన్యాసాలు ఈ ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పోతరాజులు భరత్, నగేష్, నరేష్, రాజు, శ్రీకాంత్ తదితరులున్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం


విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్న కురుమ సంఘం నాయకులు

అఫ్జల్‌గంజ్: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ అమ్మాయి తల్లిదండ్రులు ఇటీవలే మృతి చెందగా ఆ అమ్మాయికి కురుమ సంఘం తరఫున రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేసి ఆదుకున్నారు. సికింద్రాబాద్‌కు చెందిన చిలుకూరి సునీల్, ప్రేమలత ఇటీవల మరణించారు. వీరి చిన్న కూతురు జాహ్నవి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కాలేజీ ఫీజు కట్టడం కష్టంగా మారడంతో ఆదివారం అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర కురుమ సంఘాన్ని ఆశ్రయించగా చలించిన రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశాడు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కురుమ విద్యార్థి హాస్టల్ ట్రస్ట్ బోర్డు సభ్యులు కొలుపుల నర్సింహా, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అక్రమ డొనేషన్లు వసూళ్లు చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్రంలో వృత్తి విద్యా కోర్సులైన ఇంజినీరింగ్ ఫార్మసీ కళాశాలల అక్రమ డొనేషన్లను అరికట్టాలని, నవ తెలంగాణ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బైరు నాగరాజ్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం నిజాం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ కళాశాలు యాజమాన్యం కోటా 30 శాతం, కన్వీనర్ కోటా 70 శాతం సీట్లను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం భర్తీ చేయాలని తెలిపారు. కానీ అనేక కళాశాలలు ప్రభుత్వ నిబంధనలను విస్మరిస్తూ అక్రమంగా లక్షల రూపాయాల్లో డొనేష్ల రూపంలో తీసుకుంటున్నారని వెల్లడించారు. అక్రమాలకు పాల్పడుతున్న కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనియెడలా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

పదవ తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

నాంపల్లి: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విజయమాధవి సంస్థ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, నృత్య కళాకారులకు తెలంగాణ ఎక్సలెన్స్ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఆదివారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా మల్కాజిగిరి రిటైర్డ్ జడ్జి బూర్గుల మధుసూదన్, ఎన్‌సీసీ అధికారిణి మేజర్ డి.జయసుధ, కళారాధన మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి డైరెక్టర్ డాక్టర్ టి.సందీప్ కుమార్, నల్లకుంట కార్పొరేటర్ అమృత తదితరులు హాజరై విద్యార్థులకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమి వ్యవస్థాపక అధ్యక్షురాలు విజయ మాధవి సమన్వయం చేశారు.

విశేష ప్రగతి పథంలో తెలంగాణ


సుపరిపాలన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ముజీబ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్రం తొమ్మిది సంవత్సరాలలో ఎంతో ప్రగతిని సాధించిందని పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ జాయింట్ డైరెక్టర్ నరేంద్రనాథ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న దశాబ్ది వేడుకల్లో భాగంగా టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముజీబ్‌హుస్సేన్ ఆధ్వర్యంలో ఆదివారం సుపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక రంగాల్లో దేశంలోనే మొదటిస్థానం సంపాదించుకున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ యూనియన్ జిల్లా కార్యదర్శి విక్రమ్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ కేఆర్.రాజ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్, హరిబాబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలి


జయలక్ష్మి, పరిణీతలకు అవార్డును అందజేస్తున్న శ్రీనివాసులు

గన్‌ఫౌండ్రీ: ప్రతి ఒక్కరూ సామాజిక సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని సినీ నటుడు శ్రీనివాసులు అన్నారు. ఆదివారం బొగ్గులకుంటలోని సారస్వత పరిషత్‌లో మయూరి ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రిజర్వు బ్యాంక్ మేనేజర్ జయలక్ష్మి, అంతర్జాతీయ నృత్య కళాకారిణి పరిణీతలకు అవార్డులను అందజేశారు. తల్లీకూతుళ్లకు ఒకే వేదికపై అవార్డు రావడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళామోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోదావరి అంజిరెడ్డి, నిర్వాహకురాలు రాధా తదితరులు పాల్గొన్నారు.